# ముఖ్యమంత్రి కార్యాలయం

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన – 1** **తేది: 24-11-2014**

రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వ కార్యాలయాల పరిస్థితి మెరుగుపడాల్సి ఉందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు, స్థానిక వనరులను అనుసంధానం చేసుకుంటూ మున్సిపాలిటీల అభివృద్ధి కోసం ఓ ప్రత్యేక కార్యక్రమాన్ని తీసుకొస్తామని వెల్లడించారు. అసెంబ్లీలో సోమవారం రాష్ట్రంలోని నగర ప్రాంత ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి ఇష్టాగోష్టిగా మాట్లాడారు. వరంగల్ ఎమ్మెల్యేలు కొండా సురేఖ, దాస్యం వినయభాస్కర్, నిజామాబాద్ ఎమ్మెల్యే గణేష్ గుప్తా, కరీంనగర్ ఎమ్మెల్యే కమలాకర్, రామగుండం ఎమ్మెల్యే సత్యనారాయణ, వేములవాడ ఎమ్మెల్యే రమేష్ రావు, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే రవీందర్ రెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే జలగం వెంకట్రావు, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునిత తదితరులు పాల్గొన్నారు. పట్టణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం, మురికి వాడల అభివృద్ధి, గృహ నిర్మాణానికి సంబంధించి ఓ కొత్త విధానాన్ని తీసుకురావడానికి కేంద్రం ప్రయత్నిస్తున్నదని ముఖ్యమంత్రి చెప్పారు. కేంద్రం ఏం చేస్తుందో చూసి, దానికి అనుబంధంగా రాష్ట్రం ప్రభుత్వం ఏమి చేయాలనే విషయంపై నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి చెప్పారు. గతంలో కేంద్రం ఓ రకంగా, రాష్ట్రం ఓ రకంగా పోకూడదని తన అభిప్రాయమని, రెండూ కలిసి పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని ముఖ్యమంత్రి చెప్పారు. జిల్లా కేంద్రాలు, ఇతర పట్టణాల్లో ప్రభుత్వ కార్యాలయాల స్థితిగతులు మెరుగుపడాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి చెప్పారు. దీనికోసం ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాల పరిస్థితిపై సమగ్ర అధ్యయనం చేయాలని కేసీఆర్ ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు ఎన్ని ఉన్నాయి? వాటికి సొంత భవనాలు ఎన్ని ఉన్నాయి? శిథిలావస్థలో ఎన్ని ఉన్నాయి? మరమ్మతులు అవసరం అయినవి ఎన్ని? పూర్తిగా కొత్తగా కట్టాల్సినవి ఎన్ని? ఇందుకోసం ఎంత ఖర్చు అవుతుంది? ఎంత భూమి కావాలి? తదితర వివరాలు కలెక్టర్ల నుంచి తెప్పించాలని ముఖ్యమంత్రి కార్యాలయం అధికారులను సిఎం ఆదేశించారు. ఈ విషయంలో త్వరలోనే అధికారులతో ఓ సమావేశం కూడా నిర్వహిస్తామని వెల్లడించారు. పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం అవసరమైతే నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూములను అమ్మి నిధులు సమకూర్చే యోచన ఉందని చెప్పారు.

తెలంగాణ డ్రింకింగ్ వాటర్ గ్రిడ్ కార్యక్రమంతో పట్టణ ప్రాంతాల్లో కూడా ప్రతీ ఇంటికి నల్లా ద్వారా మంచినీరు అందించాలని, ఈ పథకం విజయవంతం కావడానికి ఎమ్మెల్యేలు కృషిచేయాలని సూచించారు. రూరల్ వాటర్ సప్లై విభాగం అధికారులు గ్రిడ్ పనులు చేస్తున్నారని, గ్రిడ్ ద్వారా పట్టణాల్లకు కూడా నీరు సరఫరా చేస్తారని వెల్లడించారు. గ్రిడ్ పనులకు సమాంతరంగా పట్టణ ప్రాంతాల్లో మంచినీటి సరఫరా కోసం కావాల్సిన ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణం జరగాలన్నారు. పట్టణంలోని జనాభా ఎంత? ఆవాసాలు ఎన్ని? వాటికి ఎన్ని నీళ్లు కావాలి? ఎన్ని ఓహెచ్ఎస్ఆర్ లు ఉన్నాయి? ఇంకా ఎన్ని కావాలి? పైపు లైను ఎంత ఉంది? దానిలో ఉపయోగపడేది ఎంత? మార్చాల్సింది ఎంత? తదితర విషయాలపై అధ్యయనం చేయాలని సూచించారు. గ్రిడ్ అందుబాటులోకి వచ్చే వరకు ప్రతీ ఇంటికి నల్లా పెట్టి ఉండాలని, ఒకసారి గ్రిడ్ కనెక్ట్ కాగానే నల్లా ద్వారా ఇంటిలోకి నీరు వచ్చే విధంగా ఏర్పాట్లు చేసి పెట్టాలని సూచించారు. ఈ పనుల కోసం పట్టణ ప్రాంతాలకు వెయ్యికోట్ల రూపాయలు అందివ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని సిఎం చెప్పారు.

రోడ్ల మరమ్మత్తులు, కొత్త రోడ్ల నిర్మాణం, రోడ్ల విస్తరణ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతున్నామని,పనులు నాణ్యతగా ఉండే విషయంలో ఎమ్మెల్యేలు శ్రద్ధ వహించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో కూడా రోడ్లను మెరుగు పరుస్తామని చెప్పారు. గతంలో నాసిరకం డాంబర్ వాడడం వల్ల రోడ్ల తొందరగా ఖరాబ్ అయ్యేవని, ఈ సారి డాంబరు ఏది వాడాలనే విషయంలో కూడా ముందే జాగ్రత్తలు తీసుకుంటామని, రోడ్ల నిర్వహణ బాధ్యత కూడా ఐదేండ్ల వరకు కాంట్రాక్టర్ కే అప్పగిస్తామని సిఎం చెప్పారు. వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, గజ్వేల్ పట్టణాలకు రింగు రోడ్లు వేస్తున్నామని, హైదరాబాద్ కు జిల్లా కేంద్రం నుంచి వచ్చే రహదారులన్నింటినీ నాలుగు లేన్ లుగా మారుస్తున్నామని, జిల్లా కేంద్రాలకు మండల కేంద్రాలకున్న రహదారులన్నింటినీ డబుల్ లేన్ గా చేస్తున్నామని, దీని వల్ల పట్టణ ప్రాంతాల్లో కూడా రహదారుల పరిస్థితి మెరుగు అవుతుందన్నారు. పట్టణ ప్రాంతాల్లో అంతర్గత రహదారుల నిర్మాణం, మరమ్మత్తులపై కూడా దృష్టి పెడతామన్నారు. పట్టణ ప్రాంత ప్రజాప్రతినిధులు, అధికారులతో త్వరలోనే ఓ సమావేశం నిర్వహిస్తామని సిఎం చెప్పారు.

============================================================

CPRO TO CM.